## ఈ వారం కథ

### న్యూఢిల్లీలో ...

ఎప్పుడో రెండున్నరకి ఎ.పి. ఎక్స్ప్రెస్. పన్నెండింటికే స్టేషన్‌కి వచ్చేశాం నేనూ, నాయుడూ. వారం దినాల క్రితం ఢిల్లీ వచ్చాం ఇద్దరమూ. పని పూర్తికాలేదు. అతనికి శలవైపోయింది. ఆదరాబాదరా వెళ్ళిపోతున్నాడు. మరో వారం రోజులుండి వస్తానని అతనొక్కణ్ణే పంపించేస్తున్నాను.




తీరా స్టేషన్‌కి వచ్చేసరికి ఎ.పి. ఎక్స్ప్రెస్ ఐదున్నర గంటలు ఆలస్యంగా బయల్దేరుతుందని రాసిపెట్టారు. బయలుదేరడానికే ఇంత ఆలస్యం దేనికని ఎంక్వయిరీ దగ్గర కెళ్లాం. అక్కడో పెద్ద క్యూ. క్యూలో వస్తేనే సమాధానం చెప్తారట. సరే, ఇన్నాళ్లకు క్యూలో నిలబడే క్రమశిక్షణ భారతీయుల కొచ్చినందుకు ఆనందించాం. కాని క్యూని కాదని ముందు దూరిపోతున్న భుజ బలాఢ్యులు ... వాళ్ళని ఎప్పుడూ, ఎక్కడా ఎదిరించలేం.

ఎంక్వయిరీ అబ్బాయి పలక మీద హిందీ భాషలో ఏదో రాశాడు. మాకు రాజభాష తెలీదు మొర్రో అంటే వెనకనున్నవాళ్లు లాగిపారేశారు. 'నోటితో చెప్ప నాయనా' అంటే అతను మూగా డని వెనక నున్న జనం అన్నారు. వికలాంగుల కోటాలో వచ్చిన కేండిడేట్... ఇతన్తో మాకు పని కాదంటే నోర్మూసుకో అంటుంది ప్రభుత్వం. ఇంత చిన్న విషయానికి ధర్నాలు చెయ్యాలి. బస్‌లు తగలెట్టాలి. తుపాకులు పేలాలి. కర్ఫ్యూ విధించాలి... ఇదీ ప్రజా స్వామికం... నాయుడు విశ్లేషిస్తూ అరిచాడు.. అరణ్యరోదన.

ఎ.పి. ఎక్స్ప్రెస్ బయల్దేరే వరకూ — ఈ ఏడు గంటలూ ఏం చెయ్యాలి? వూళ్లో తిరగాలని సామాన్లు క్లాక్ రూమ్‌లో పడేసి ప్లాట్‌ఫామ్ మీదికి వచ్చాం.

ఎవరో అమ్మాయి పక్క నుంచి వచ్చింది. చేతిలో వున్న కెమెరాని చూపిస్తోంది. ఇండియన్ కాదు. ఎవరో ఫారినర్. పాలలాగా తెల్లగా వుంది. బంగారు రంగు తల వెంట్రుకలు. పువ్వుల సిల్కు గౌను... చాలా నీట్‌గా వుంది. పశ్చిమ దేశాల నుంచి కొట్టుకొచ్చే హిప్పీ బాపతు కాదు. కెమెరా చూపిస్తూ ఏదో అంటోంది. రష్యన్ లాగా వుంది.

నాయుడిగారికి కొద్దిగా రష్యన్ భాష తెలుసు. మూడేళ్లు రష్యాలో ఏదో పుస్తకాల షాపులో అను వాదకుడుగా పనిచేసి వచ్చాడు. ఏదో ఆ అమ్మా యితో రష్యన్‌లో మాట్లాడాడు. తన భాష వినగానే ఆ అమ్మాయి ముఖం ఇంతయింది. ఢడామడా రష్యన్‌లో మాట్లాడేసుకున్నారు.

"ఏవిటయ్యా మీ ఇద్దరి సణుగుడూ? తెలుగులో చెప్ప" అడిగాను.

"కెమేరా అమ్ముతుందట."

నేను కెమేరా తీసుకుని చూశాను.

"ఎంత?"

"ఐదొందలట."

కిందా మీదా చూశాను. జపాన్ కెమేరాలా వుంది గాని కెమేరా చాలా మోటుగా వున్నట్టని పించింది.

"రష్యా సరుకులు అలాగే వుంటాయి."

కెమేరా విప్పి చూసేస్తున్నాను. పెదవి విరచాలనిపించింది. మేడిన్ జపానో, అమెరికాయో, జర్మ నీయో, ఇంగ్లాండో అని వుంటే తక్కువ కొనేసి వుండేవాడిని. రష్యన్ సరుకనగానే బేరమాడాలని పించింది.

"మూడొందల కిస్తుందేమో కనుక్కో."

మావాడు అడుగుతూనే వున్నాడు, ఇంతలో

22-5-92 ఆంధ్రజ్యోతి సచిత్ర వారపత్రిక




ఎవరో పంజాబీ ఆయనొచ్చి "ఎంతట" అనడిగాడు.

"ఐదొందలు చెప్తోంది. మూడొందలకి..."

నా నోట్లో మాటలు నోట్లోనే వున్నాయి పంజాబీ అతను ఐదు నోట్లు ఇచ్చేసి కెమేరా తీసేసు కున్నాడు.

"ఐదొందలంటే డేమ్ చీప్. దాని అసలు ఖరీదు ఐదు వేలన్నా వుంటుంది" కెమెరా తీసుకుని వెళ్లిపోయాడు.

నోరావలించి నాయుడు వేపు చూస్తూ వుండిపోయాను.

"అంత ఖరీదుంటుందా నాయుడూ?" అన్నాను మెల్లగా.

"వుండొచ్చు. కాని మన దేశానికి రష్యా వస్తువులేం రావుగా — అందుకని వాటి విలువ మనకి తెలీదు."

"అవును. రష్యా ప్రపంచంలో అతి పెద్ద దేశం కదా. సైంటిఫిక్‌గా అంత ముందున్న దేశం కదా, స్పుత్నిక్‌ని ఆకాశంలోకి పంపిన మొట్టమొదటి దేశం కదా. ఆ దేశపు వస్తువులు ఏ దేశంలోనూ అమ్మరేం?" అనడిగాను.

"రష్యా ఏ దేశానికీ - ఒక్క సాహిత్యాన్ని తప్ప - తన తయారీలను ఎగుమతి చెయ్యదు. అందుకే ఆ సరకుల గురించి ఎవరికీ తెలీదు."

ఆ అమ్మాయి మరో కెమేరా తీసింది. అప్పటికే ఆ అమ్మాయి చుట్టూ వంద మంది వరకూ గుమిగూడిపోయారు.

"వెయ్యి రూపాయలు" అంటోంది వేళ్లు చూపిస్తూ.

"రేటు పెంచేసిందోయ్"

"కాదు ఇది మరీ ఖరీదైందేమో" నాయుడు అనుమానంగా అన్నాడు.

జనం ఎగబడి కెమెరాని చూస్తున్నారు.

ఎవడో హరియాణీ - పెద్ద తలపాగా ధరించిన స్థూలకాయుడూ, గుబురు మీసాలవాడూ - ఆ కెమేరాని వెయ్యి ఇచ్చేసి లాక్కున్నాడు.

"ఇంకా ఏవిటున్నాయ్?" అని హిందీలో అడిగాడు.

ఆవిడ ఇంకా సామాన్లు చూపిస్తోంది. చిన్న ట్రాన్సిస్టర్లు, టార్చిలైట్లు, కాలుక్యులేటర్లు, సెంట్లూ, సిల్కు రుమాళ్లు — అన్నీ మేడిన్ రష్యావి -చకచకా అమ్మేస్తోంది.

నాకూ ఏదో ఒకటి కొనాలని వుంది. కాని ఎందుకో కొనబుద్ధి పుట్టడం లేదు. రష్యన్ సరుకంటే ఏవిటో చెప్పలేను -అంత మన్నికైనవి కాదని - ఎందుకో అనిపిస్తోంది.

"చవగ్గా వస్తుంటే అలానే అనిపిస్తుంది. పాపం డబ్బుల్లేక అమ్మేస్తోందట" అన్నాడు నాయుడు.

"డబ్బుల్లేక పోవడమంటే?"

"మూణ్నెల్ల క్రితం ఇండియా వచ్చిందట. వచ్చే ముందు రష్యా నుంచే వచ్చిందట. కాని రెణ్నెల్లల్లో రష్యా ముక్కలైపోయి ఏ రష్యాకి వెళ్లాలో తెలీక ఇక్కడే పిచ్చిగా తచ్చాడుతూందట.",

"అయ్యో పాపం. అయితే ఏదో ఒక వస్తువు కొందాం."

మేం కొనాలని తయారయ్యేసరికి ఆమె దగ్గరున్న వస్తువులన్నీ అయిపోయాయి. "ఈ డబ్బుతో స్వదేశానికి వెళ్ళిపోతుందా? అడిగి చూడు నాయుడూ!"

నాయుడు ఆమె నేదో అడిగాడు.

ఆవిడ నాయుడు వేపు అదోలా చూసింది.

"ఏవిటడిగావ్ - అలా చూస్తోంది?" — మనవాడి రష్యన్ ఉచ్చారణలో ఏదన్నా తప్పర్థం దొర్లిందేమోనని.

"తిరిగి వెళ్ళడానికి డబ్బుల్లేవా అన్నాను."

ఆ అమ్మాయి ముఖం బిగుసుకుపోయింది. రష్యన్ భాషలో ఏదో గొణిగింది.

"డబ్బుల్లేక కాదు. అక్కడ తిండిలేదు" అని సమాధానం ఇచ్చిందట.

"మీ దగ్గర తిండి లేకపోవడమేమిటి? మీది అగ్రరాజ్యంగా?"

"అగ్రరాజ్యంగా వుండాలనేటప్పుడు మాకు వ్యక్తి స్వాతంత్ర్యం లేదు. వ్యక్తికి స్వాతంత్ర్యం ఇచ్చేసరికి నిత్యావసర వస్తువులు బ్లాకులోకి పోయాయి" అందిట.

"ఆ కాలం బావుందా? ఈ రోజులు బావున్నాయా?"

ఆవిడ మాట్లాడలేదు. ఖాళీ సంచి పట్టుకుని చరచర నడిచి వెళ్ళిపోయింది.

ఏమనాలో మాకు అర్థం కాలేదు.

ఒక కుటుంబం విచ్ఛిన్నం కావడం చూశాం, ఒక సంసారం

నాశనం కావడం చూశాం. ఆ సంసారం కూలిపోతే ఆ కుటుంబం ఎలా వీధిన పడుతుందో తెలుసు.

కాని ఒక మహా సామ్రాజ్యం కూలిపోవడమనేది - అదీ ఒక నెల దినాల్లో - స్వయంగా ఈ కళ్లతో చూశాం. ఆ సామ్రాజ్యంలోని ప్రజలకి ఇంతకు ముందు ఎంత విలువ, గౌరవం వుండేదో, అవన్నీ ఇతర దేశాల నగరాల్లో అతి నగ్నంగా వేలం వేయబడడం స్వయంగా చూసి నవ్వాలో ఏడవాలో అర్థం కాలేదు.

*    *    *

నాయుడు వెళ్ళిపోయాడు.

మూడ్రోజుల తర్వాత సరోజినీ నగర్ రైల్వే బుకింగ్ ఆఫీస్‌కి టికెట్ బుక్ చేసుకునేందుకు వెళ్ళాను.

టిక్కెట్ తీసుకుని సరోజినీ నగర్ బజార్ వైపు వెళ్ళాను.

రోడ్డు మీద ఎవరో అమ్మాయి... ఫారిన్ వనిత... రోడ్ క్రాస్ చేస్తూ కనిపించింది.

మొన్న న్యూఢిల్లీ స్టేషన్‌లో చూసిన అమ్మాయే. రష్యన్ వనిత కదూ?

ఆమె ఎదురుపడగానే 'హలో' అన్నాను ఏదో పెద్ద ఆత్మీయత వున్నట్టు.

ఆ అమ్మాయి స్టన్ అయి నా వైపు ఎగాదిగా చూసింది.

"నేను మీకు తెలుసా?" అంది ఇంగ్లీషులో.

నేను స్టన్ అయాను. ఇప్పుడు కొంపదీసి స్టేషన్‌లో కనిపించిన రష్యన్ వనిత కాదేమో. ఆమెకు ఇంగ్లీషు తెలీదు. ఈవిడ ఇంగ్లీషు మాట్లాడుతోంది.

"మీకు ఇంగ్లీషు తెలుసా?"

ఆమె తల వూపింది. నా వేపే చూస్తోంది - నన్ను ఎక్కడ చూసిందో గుర్తుకు తెచ్చుకుంటోందా?

"అటు మొన్న మీరు న్యూఢిల్లీ స్టేషన్లో కెమేరా అమ్ముతూ కనిపించారు"

ఆమె 'ఓ...ఎస్' అన్నట్టు అక్కడి నుంచి




కదలబోయింది.

"మీరు రష్యన్ కదూ?"

ఆమె మాట్లాడలేదు. ముందుకు వెళ్తోంది. నేను వెంటపడ్డాను.

"ఆగండి మేడమ్. మీతో మాట్లాడాలి."

"సారీ. నా దగ్గర వస్తువులేవీ లేవు. అమ్మేశాను."

"అది కాదు. మిమ్మల్ని కొన్ని విషయాలు అడగాలి."

ఆమె ఆగి అనుమానంగా చూసింది.

"ఏవిటి అడుగుతారు? సారీ. నాకు టైమ్ లేదు" అని చరచర వెళ్లిపోయింది.

రోడ్ మీద నిలబడే ఆమె వెళ్లిన వేపు చూస్తూ వుండిపోయాను.

పాపం - స్టేషన్లో సామాన్లు అమ్మినందుకు సిగ్గుపడట్టుంది. తప్పించుకుపోయింది. ఒకా నొకప్పుడు బాగా బతికిన కుటుంబం — తర్వాత కారణాంతరాల వల్ల విడిపోతే — వాళ్ళ బ్రతికేందుకు ఏదో ఒక దారిని వెదుక్కుంటారు. మొదట్లో ఆ జీవితం దుర్భరంగా వుంటుంది. పూవులమ్మిన చోటే కట్టెలమ్మినట్టు బాధపడ తారు. ఎవరన్నా గుర్తుచేస్తే సిగ్గుతో బాధతో కుమిలిపోతారు.

బహుశా ఈ రష్యన్ వనిత కూడా అలానే బాధపడి వుంటుంది.

నిన్న మొన్నటి వరకూ ప్రపంచ అగ్రరాజ్యా అని ఖబడ్దార్ అని నిలబెట్టిన దేశం ఒక రాత్రికి రాత్రి కూలిపోవడంతో — ఆ ప్రజలు ఎవరికి వారే అన్నట్టు విడిపోవడం తలచుకుంటే బాధే అనిపిస్తోంది.

మరో అమ్మాయి ఎవరో నన్ను రాసు కుంటూ వెళ్లిపోయింది.

తలెత్తి చూశాను ఎవరో మరో రష్యన్ స్త్రీ. వీపు మీద పెద్ద సంచీ వుంది. సంచి నిండా కెమేరాలూ, టార్చిలైట్లూ, ట్రాన్సిస్టర్లూ వుండి వుండాలి. ఎక్కడో అమ్ముకోడానికి పోతోంది.

ఇలా ఎంత మంది రష్యన్లున్నారు ఇక్కడ.

నిట్టూర్పు విడిచి మెల్లగా బజారు వేపు వెళ్ళాను — ఏదన్నా సామాన్లు కొనాలని. ఇక్కడ స్మగుల్డ్ గూడ్స్ దొరుకుతాయి. ఇండియన్‌వీ దొరుకుతాయి. బాగా వున్నవి ఎంచుకోవచ్చు.

ముందు కెమేరా తీసుకోవాలనిపించింది. ఒక షాపులోకి వెళ్లాను.

## చతురోక్తులు

మహామేధావి శ్రీ కట్టమంచి రామలింగారెడ్డి. మంచి హాస్యప్రియులు. చమత్కార కుశలులు. చతుర సంభాషణాపరులు. జాతీయ ఉద్యమం ముమ్మరంగా సాగుతున్న రోజులవి. అప్పట్లో విదేశీ వస్తువులు బహిష్కరించడం, స్వదేశీ వస్తువులపై ఎనలేని మక్కువ చూపడం జాతీయవాదులు విధిగా ఆచరిస్తున్నారు. విద్యార్థుల సమావేశంలో ప్రసంగించడానికి అలహాబాద్ వెళ్ళిన సి.ఆర్. రెడ్డిగారు యూరోపియన్ సౌకర్యాలుగల హోటల్లో మకాం చేశారు. జాతీయ వాదులు విమర్శిస్తే నవ్వి **"I want European comforts. The soul is swadeshi but the stomach is videshi..."** అని సమర్థించు కున్నారు.

రెడ్డిగారు ఆచార్య పదవిలో వున్నప్పుడు ప్రతి శనివారం విద్యార్థులకు తన బసలో టీ ఏర్పా టుచేసేవారు. ఒకసారి ఒక విద్యార్థి కప్పులోని టీని, టేబుల్ పైకి వంగి త్రాగడం చూచి రెడ్డిగారు... "మిస్టర్ భీమారావ్! సాధార ణంగా మనుష్యులు కప్పుని చేతితో పట్టుకుని నోటి దగ్గరకు తీసుకుపోతారు. దీనికి భిన్నంగా వుండుట జంతువుల పద్ధతి" అన్నారు. భీమా రావ్ దానికి తగినట్టుగా "ఆ విషయం నాకు తెలియును సార్... కానీ ఆ పద్ధతులలో ఏది మంచిదో అని చూచుచున్నాను" అన్నాడు. వెంటనే రెడ్డిగారు "నేను నీ పరిశోధన బుద్ధిని మెచ్చుకొనుచున్నాను. కాని ఈ పరిశోధన ఫలి తాలు మాకు కూడా వెంటనే తెలియజేయవలెను"

అని హాస్యాన్ని మిళితం చేసి సన్నివేశాన్ని రక్తి కట్టించారు.

సేకరణ: భమిడిపాటి వెంకటేశ్వరరావు

షాపువాడు అన్ని రకాల కెమేరాలు చూపించాడు. ఒక కెమేరా తీశాను. చాలా బావుంది. మేడిన్ జర్మనీ.

"ఎంత?"

"ఆరువేలు"

కిందా మీదా చూశాను. విప్పి చూశాను. అచ్చు రష్యన్ అమ్మాయి అటుమొన్న చూపించిన కెమేరాలాగానే వుంది. ఆమె వెయ్యి కిస్తానంటే రష్యన్ మేడ్ అని గొణిగాను.

"ఇచ్చే బేరం చెప్పండి"

సిటీల్లో సాధారణంగా ఏ వస్తువునీ బేరం చెయ్యరు. చేస్తే బైతులాగా చూస్తారు. ఈ విషయం మొన్నటిది. కాని వ్యాపారస్తులు చేస్తున్న మోసం ఈవాళ అందరికీ తెలుసు. అందుకని బేరమాడ్డం సర్వసాధారణం అయిపోయింది.

"ఐదున్నర యివ్వండి."

"వద్దు... మూడువేలు" అన్నాను.

దుకాణం దారుడు బతిమాలుతున్నాడు ఐదిమ్మంటున్నాడు. మరో వంద తగ్గించాడు. మరో రెండొందలు.

వెళ్ళిపోవాలనుకున్నాను. లోపలి నుంచి ఒక పంజాబీ అతనూ హరియాణీ అతనూ వచ్చారు. వీళ్లను చూసినట్టు గుర్తు... అవును మొన్న ఢిల్లీ రైల్వే స్టేషన్లో రష్యన్ అమ్మాయి దగ్గర కెమేరాలు కొన్నవాళ్ళే.

"కెమేరా... మూడువేలు అడుగుతున్నాడీయన" దుకాణమతను పంజాబీ వాడితో అన్నాడు.

"మరో వంద హెచ్చేసి అమ్మెయ్" అన్నాడు అతను.

నాకు అనుమానం వచ్చింది. వీళ్ల రష్యన్ దగ్గర చవగ్గా కొనేసి ఇక్కడ మూడు రెట్లకి అమ్ము తున్నారా?

కెమేరాని కిందా మీదా చూశాను. అవును రష్యన్ కెమేరాయే. రష్యన్ అక్షరాలు మార్చేసి ఇంగ్లీషులో రాసిన ప్లేటు అతికించారు.

"తీసుకోండి సార్" అన్నాడు షాపువాడు.

కెమేరా కింద పెట్టాను.

"ఆయనెవరు?" పంజాబీ అతన్ని చూపిస్తూ అడిగాను.

"ఈ షాపు ఆయనదే"

"మీరు?"

"జీతగాణ్ణి"

పంజాబీ చేస్తున్న మోసం అర్థమయింది. వీళ్లు అక్కడ ఐదొందలకి కొనేసి ఇక్కడ మూడు వేలకి అమ్ముతున్నారు! రష్యావాళ్లు చిదిగిపోయారని వాళ్ళని ఇంత మోసం చేస్తున్నారా వీళ్ళు?

"తీసుకోండి సార్.. రెండున్నర వేలు ఇవ్వండి... రెండు వేలు..."

గిరువ తిరిగి ఎదురు షాపులోకి వెళ్లాను. స్వెట్టర్ల దుకాణమది. రెండు స్వెట్టర్లు తీసుకున్నాను.

ఇంతలో ఎదురు పంజాబీ అతని షాపులోపలి నుంచి రష్యన్ వనిత వస్తోంది. పెద్ద సంచీ వుంది. దాన్లో చాలా వస్తువులున్నట్టున్నాయి.

ఇందాక రోడ్ క్రాస్ చేసినపుడు ఆమె దగ్గర ఏ సంచీ లేదు. ఇప్పుడు సంచెలా వచ్చింది?

తన వస్తువులన్నీ ఈ షాపులో పెట్టుకుందా? రోజూ కొద్ది కొద్దిగా తీసుకుని అమ్ముతోందా?

షాపులో దాచుకుంటే — అదే షాపు ఓనర్ పంజాబీ వాడు — ఆమె దగ్గర స్టేషన్లో కెమేరా ఎందుకు కొన్నట్టు? తర్వాత వచ్చిన హరియాణీ వాడు అదే కెమేరాని వెయ్యి కెందుకు కొన్నట్టు?

హరియాణీవాడు ఆమెకు డబ్బిచ్చాడు. ఆమె డబ్బు తీసుకుని పర్స్‌లో కుక్కుకుంది. "నువ్వెళ్లు, మేం తర్వాత వస్తాం" అంటున్నాడు పంజాబీ ఇంగ్లీషులో.

పంజాబీ హరియాణీ వాళ్ళకీ, ఈ రష్యన్ వనితకూ వున్న వ్యాపార సంబంధం అర్థమైపోయింది. నా అనుమానం నిజమే.

**రష్యా దెబ్బతినేసింది ... రష్యన్లు దిక్కుతోచని వాళ్ళయిపోయారు... ఆ విషయం ఈ హరియాణీకి, పంజాబీ వాడికీ తెలుసు. అలాంటి ఒక రష్యన్ వనితను వీళ్లు పట్టుకున్నారు. తమ దగ్గరున్న నాసిరకం కెమేరాలని ఆమె కిచ్చి స్టేషన్లో రష్యన్ మేక్‌గా అమ్మేస్తున్నారు. భారతీయుల వీక్నెస్ వాళ్ళకి తెలుసు. ఫారిన్ గుడ్స్ అంటే పిచ్చిగా ఎగబాకుతారు.**

**అయితే రష్యన్ వస్తువులకి గిరాకీ లేదు. అందుకని వాళ్ళే వచ్చి రష్యన్ వస్తువులని పొగిడేస్తూ తమ చీప్ వస్తువుల్ని అమ్మేసుకుంటున్నారు.**

**ఆ దేశం పెరిస్త్రోయికా బరువుని తట్టుకోలేక కుప్పకూలిపోతే, ఈ దేశం ప్రజాస్వామికం పెరిస్త్రోయికాను పట్టపగలు హైజాక్ చేసి స్టేషన్లో అమ్మేస్తోంది.**

గబగబ వెళ్లాను. రోడ్డు దగ్గరే ఆమెను ఆపాను. ఆమె నా వేపు ఆశ్చర్యంగా చూసింది. ఛట్టున ఆమె చెయ్యి పట్టుకున్నాను. ఆమె వొణికిపోతోంది—

"పద" అన్నాను.

ఎక్కడికి? అనైనా అనకుండా నా వెనకనే టాక్సీ ఎక్కింది.

పతనం మొదలయ్యాక మనిషికీ - దేశానికీ భేదం వుండదు. దానికి మోసం చెయ్యడం ఎంత సులభమో, మోసపోవడం కూడా అంతే సులువు. ఆ పరిస్థితిలో ఎంతవరకైనా దిగజారిపోవడం ఆ పతనానికి పరాకాష్ఠ.

[న్యూఢిల్లీ స్టేషన్‌లో ఒక రష్యన్ వనిత కెమేరాలు అమ్మడం చూశాక...] ■

## మాటల్లో చమత్కారాలు

■ ఓ సినిమాలో వ్యభిచారం నేరం మీద అరెస్టయిన జయమాలిని విడుస్తుంటే ఒక పోలీసు వెంకటస్వామి ఓదార్పు — "ఆడది విడిస్తే ఇంటికి అరిష్టం అంటారు. ఇక్కడ విడిస్తే పోలీసు స్టేషన్‌కే అరిష్టం..."

■ ఓ సినిమాలో ఓ పాత్ర చెప్పిన విషయం ఇది. "హైదరాబాద్‌లో రిక్షా ఎక్కిన వాడెవ్వడూ తలెత్తుకు తిరగలేడు. (వడుం వంగిపోయి) ఊరంతా అప్పులు చేసిన వాడికే అది మంచిది"

■ ప్రపంచ వ్యాప్తంగా గొప్ప హాస్య నటులుగా పేరు తెచ్చుకొన్న మార్క్స్ సోదరులలో చివ్వవాడైన చికో మార్క్స్ ఒక రోజున తన ఇంటి నుంచి అన్న గ్రుచో మార్క్స్‌కి ఫోన్ చేశాడు. మాటల మధ్యలో "ఇప్పుడే వస్తానుండు" అంటూ రిసీవర్ను బల్లమీద పెట్టి తిన్నగా బయల్దేరి గ్రుచో ఇంటికెళ్ళి ఫోన్ పట్టుక్కూచున్న అతడితో "ఆ... ఏవిటీ చెప్తున్నామూ..." అంటూ మాటలు కొనసాగించాడట.

■ రాజా — రాణి — జాకీ చిత్రం బాగా నడవకపోవడం గురించి నిర్మాత కృష్ణంరాజు ఒక మిత్రుడితో ఇలా అన్నారట... "అల్ కౌంట్ నుంచి తప్పించుకుని మిడిల్ డ్రాప్‌తో బయటపడ్డాము".

సేకరణ: భమిడిపాటి వెంకటేశ్వరరావు